దుర్గామాత మహా సంకల్ప శోభాయాత్ర

దుర్గామాత అమ్మవారితో వనిత వాక్కు మహిళలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని వనిత వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 108 కళశాలతో దుర్గామాత మహాసంకల్ప శోభాయాత్ర నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగు వేణు కుమార్ మాట్లాడుతూ.. విశ్వనాథ స్వామి దేవస్థానంలో అమ్మవారికి అభిషేకం, లలిత సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గామాత అష్టోత్తర శతరామావళి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయం నుంచి పట్టణంలోని ఆర్‌బీ హెచ్‌వీ పాఠశాల గ్రౌండ్ వరకు అమ్మవారి శోభాయాత్ర నిర్వహించి, మహిళలు బతుకమ్మ ఆడారు. ఫౌండర్స్ తాళ్లపల్లి కవిత, కుర్మ సునిత, జ్యోత్స్న చంద్రదత్, చందన, చిగురు మంజుల, తణుకు తేజశ్విని పాల్గొన్నారు.

జిల్లాతో అనుబంధం మరువలేనిది

బదిలీపై వెళ్లిన డీఈవో పార్శి అశోక్‌ను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు, ఉపాధ్యాయులు ఆత్మీయతకు మారుపేరని బదిలీపై వెళ్లిన డీఈవో పార్శి అశోక్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయనను సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మూడేళ్లపాటు పని చేసిన అనుభూతి మర్చిపోలేనిదని తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులను, ప్రజలను ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని గ్రహించినట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తాను చేసిన ప్రయత్నానికి ఉపాధ్యాయులు, బోధనేతర వర్గాల నుంచి లభించిన సాయం మరువలేనిదన్నారు. వేదికపై డీఈవో కార్యాలయ ఎఫ్ఏవో దేవాజి, ఏసీజీ ఉదయబాబు, ఎంఈవోలు రమేశ్ బాబు, జయరాజ్, శివ చరణ్, డీఎస్వో మధూకర్, ఏసీఎంవో ఉద్దవ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నిక

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : మంచిర్యాల పట్టణ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్‌ను వ్యవస్థాపకుడు ఎండీ గౌస్ సమక్షంలో ఆదివారం మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ణకంటి రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రామగిరి శ్రీనివాస్, కోశాధికారి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులుగా మడుపు శ్రీనివాస్ చారి, పుట్ట కుమార్, ఎండీ ఫార్వీజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిలుకూరి శ్రీనివాస్ చారి, కార్యదర్శిగా మల్క ప్రతాప్, విజయ్, రాజు, ప్రచార శ్యామ్, సుధాకర్, సురేందర్, శ్రీనాథ్ గౌడ్ ఎన్నికయ్యారు. మెకానిక్‌ల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం పనిచేస్తుందని అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

నలుగురిపై కేసు నమోదు

దహెగాం, అక్టోబర్ 6 : అక్రమంగా ఆవులను తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కన్నెపల్లి మండలం చింతపుడి లింగాలకు చెందిన హైమద్, నాయిని శ్రీనివాస్, సంజీవ్, గంట శంకర్ వివిధ గ్రామాల్లో 26 ఆవులను కొనుగోలు చేసి, శనివారం రాత్రి దహెగాం మండలం ఎర్రవాగు సమీపం నుంచి అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం మేరకు అక్కడికి చేరుకొని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాటిని గోశాలకు తరలించినటుల, వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాత్రి బయటకు వచ్చిన వారి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాత్రివేళలో దుకాణాలను మూసివేయిస్తున్న పట్టణ సీఐ బన్సీలాల్

పట్టణంలో పోలీసుల నిఘా

- రాత్రి 10 దాటిందంటే కొరఢా ఝుళిపిస్తున్న పోలీసులు
- అనుమానాస్పద వ్యక్తులపై ఫోకస్
- పండుగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించాలి
- సోషల్ మీడియాపై దృష్టి : రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : మంచిర్యాల పట్టణంలోని రాత్రుళ్లు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. రాత్రి 10 గంటలు దాటిందంటే రోడ్లపై అనుమానితులు కనిపిస్తే కొరఢా ఝుళిపిస్తున్నారు. శాంతి భద్రతల నేపథ్యంలో రాత్రి 10:30 గంటల తరువాత ఎమర్జెన్సీ, దవాఖానలు, మెడికల్ దుకాణాలు మినహా హోటళ్లు, బార్లు, చిరువ్యాపారస్తుల దుకాణాలు, మిగతావి మూసివేయిస్తున్నారు. బైకులపై తిరుగుతున్న వారిని ఆరా తీస్తున్నారు. ఏ కారణం లేకుండా బయటకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నారు. అత్యవసర సమయంలో బయటకు వస్తే తగిన కారణాలు చెప్పాలని, వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ చేస్తూ నేర నియంత్రణకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

సెలవుల్లో ఊరు వెళ్తే జాగ్రత్త..

దసరా పండుగ సెలవులను పురస్కరించుకొని జిల్లావాసులు ఊరు వెళ్తున్నారా..? అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచిస్తున్నారు. దసరా సెలవులు వచ్చిన సందర్భంగా ప్రజలు ఎక్కడికైనా వెళ్తుంటే సోషల్ మీడియాలో లొకేషన్స్, ట్రావెల్ ప్లాన్స్ అప్డేట్ పెట్టవద్దని, స్వీయ రక్షణ కోసం ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలి చెప్తున్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, డబ్బు, బ్యాంక్‌ల్లో భద్రపర్చుకోవాలని, లేకపోతే రహస్య ప్రదేశాల్లో దాచిపెట్టుకోవాలని అంటున్నారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్స్ లాంటివి అమర్చుకోవాలని సూచిస్తున్నారు. ఇంటి ముందు పార్కింగ్‌లో ఉంచిన బైకులకు వీల్స్‌లాక్, చైన్‌తో పోల్స్‌కు లాక్ చేసుకోవడం లాంటి జాగ్రత్తలు పాటించాలని చెప్తున్నారు. నమ్మకమైన వారిని వాచ్‌మన్‌గా నియమించుకోవాలని, పక్కింటి వారికి ఇంటివైపు చూస్తూ ఉండాలని అంటున్నారు. ప్రజలు తప్పనిసరిగా పోలీసు వారి సూచనలు పాటించాలని తెలిపారు.

❖ సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..

సామాజిక మాధ్యమాలైన ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లో చట్టవ్యతిరేక పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. అలాంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తాం. పీడీ యాక్ట్ నమోదు చేసి, జైలుకు పంపిస్తాం. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేముందు అవి నిజమా..? కాదా..? అని ఒకసారి ఆలోచించుకోవాలి. రామగుండం పోలీస్ స్టేషన్‌లో నిరంతరం సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ (ఎస్ఎంటీసీ) మానిటరింగ్ నిఘా ఉంటుంది.

- శ్రీనివాస్, పోలీస్ కమిషనర్, రామగుండం



కుకుడలో కుంట వద్ద ఎడ్ల బండి, కుర్చీ, ప్రకృతి సౌందర్యం

❖ ఉషోదయ ప్రకృతి సౌందర్యం..

బెజ్జూర్, అక్టోబర్ 6 : మండలంలో ప్రస్తుతం వర్షాలు లేవు. చెరువులు, కుంటల నుంచి పొలాలకు నీటిని మళ్లించేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుకుడలో కుంట వద్దకు ఆదివారం రాత్రే ఓ రైతు ఎడ్లబండితో వచ్చాడు. రాత్రంతా నీరు పారించాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున రోడ్డు పక్కనే ఎడ్లబండి, కుర్చీ, కుంటలో నీరు, ఉషోదయ ప్రకృతి సౌందర్యం.. అటుగా వెళ్తున్నవారిని ఆకట్టుకున్నది.

సూర్య కిరణాలు పడుతుండడంతో అందంగా కనువిందు చేస్తున్న ఎర్రవాగు

❖ ఎర్రవాగు అందాలు..

దహెగాం, అక్టోబర్ 6 : దహెగాం మండలంలోని ఎర్రవాగు.., తూర్పువైపు పచ్చని అడవి.. పైగా సూర్యోదయ అందాలు చూడముచ్చటగొల్పుతున్నాయి. గళగళ పారుతున్న నీటిపై లేలేత సూర్యకిరణాలు పడుతుంటే సేందుకు రెండు కండ్లూ సరిపోవు అనే రీతిన ఆకట్టుకుంటున్నాయి. కిలో మీటరు మేర వాగుపై కిరాణాలు పడుతూనే ఉన్నాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యాలు 'నమస్తే' కెమెరాకు చిక్కాయి.

రాష్ట్ర కో కన్వీనర్‌గా రవీందర్

దుర్గం రవీందర్

రెబ్బెన, అక్టోబర్ 6 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్‌గా రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ను నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమని, ఉద్యమ సమయంలో అనేక మంది యువకులు ప్రాణత్యాగాలు చేశారని రవీందర్ పేర్కొన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా కృషిచేస్తానన్నారు. రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

నెన్నెల, అక్టోబర్ 6 : ప్రేమించి.. పెండ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఓ ప్రియురాలు న్యాయం కోసం ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. యువతి తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన రేషవేని రాజేశ్.. మైలారం గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతితో ప్రేమ వ్యవహారం సాగించాడు. ఈ క్రమంలో పెండ్లి చేసుకోవాలని అడిగితే తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. కొన్ని నెలలుగా పట్టించుకోవడంలేదు. ఈ విషయమై వారం కింద నెన్నెల పోలీస్ స్టేషన్‌లో రాజేశ్ కనబడడంలేదని ఫిర్యాదు చేసింది. పెండ్లికి నిరాకరిస్తున్నాడని నెన్నెల ఎస్ఐ, బెల్లంపల్లి సీఐని కోరింది. ఈ క్రమంలో రెండు రోజులుగా రాజేశ్ ఇంటి ఎదుట బైఠాయించింది. పెండ్లి చేసుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేసింది. అయితే రాజేశ్‌కు ఇప్పటికే పెండ్లి అవగా, రెండేళ్ల పాప కూడా ఉన్నది. భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. యువతి ఇంటి ముందు బైఠాయించడంతో తాళం వేసి పరారయ్యాడు.

నేడు ప్రజావేదిక

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోంవారం 15వ విడుత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, ఏపీవో బాలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ కొనసాగిందని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీ నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపిస్తారని, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, మండల ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు.

అంగ్రాజ్‌పల్లిలో వైద్య శిబిరం

చెన్నూర్ రూరల్ అక్టోబర్ 6 : చెన్నూర్ పట్టణంలోని శ్రీ కిరణ్ మెడికల్, దేవి మెడికల్ ఆధ్వర్యంలో మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరీక్షలు చేశారు. అందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవి, శ్రీకరణ్ మెడికల్ నిర్వాహకులు బుద్దారపు ప్రకాశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గన్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కౌటాల, అక్టోబర్ 6 : కౌటాల మండలం ముత్తంపేట సాయిరాం రైస్ మిల్ వద్ద రెండు బైకులు ఢీ కొట్టుకోగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలోడి గ్రామానికి చెందిన రాజన్న ముత్తంపేట నుంచి కౌటాల వైపు వస్తున్నాడు. ముత్తంపేట గ్రామానికి చెందిన వశాకే సంతోష్, చందు.. సాయి రాం రైస్ మిల్లు నుంచి బియ్యం తీసుకొని రోడ్డుకు ఒకేసారి రావడంతో రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. రాజన్న తలకు తీవ్రగాయాలవగా, సంతోష్, చందుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ మధూకర్ సంఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను సిర్పూర్ సామాజిక దవాఖానకు తరలించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

హాజీపూర్, అక్టోబర్ 6 : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ సూచించారు. మండలంలోని నంనూర్, గుడిపేట పునరావాస కాలనీల్లో ఆదివారం రాత్రి పోలీస్ కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. గంజాయితో పాటు, మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ కళాజాత బృందం, ఏఎస్ఐ చాంద్‌పాషా, వొడ్డె బాలరాజు, బేర పోశయ్య, చెల్ల రమేశ్, హాజీపూర్ పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రాజారంలో వీధి దీపాలు

- 'నమస్తే' కథనానికి స్పందన

వీధి దీపాలు అమర్చుతున్న జీపీ సిబ్బంది

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి మండలం రాజారం గ్రామ పంచాయతీలో గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీనాథ్ స్వామి, కార్యదర్శి ఉదయ్ ఆధ్వర్యంలో ఆదివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వీధిదీపాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండగా, ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారంపై గ్రామస్తులు 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపారు.

కోటపల్లిలో గ్రామసభ

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. తనిఖీ బృందాలు వారు చేసిన తనిఖీ నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కౌటాల, అక్టోబర్ 6 : కౌటాల మండలం సాండ్‌గాం గ్రామానికి చెందిన ఖోబ్రగడే మనోహర్ (28) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య సుకున్నట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు. మనోహర్ భార్య కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స చేయించేందుకు డబ్బు లేకపోవడంతో మనస్థాపానికి గురై, మద్యానికి అలవాటుపడ్డాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని దవాఖాకు తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతిచెందాడు. తండ్రి దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దహెగాంలో పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి : జనగామలో..

కొనసాగుతున్న పూజలు

దహెగాం, అక్టోబర్ 6 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. నాల్గోరోజు అన్నపూర్ణా దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

కోటపల్లి, అక్టోబర్ 6 : కోటపల్లి, కొండంపేట, జనగామ, నందరాంపల్లి తదితర గ్రామాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కుంకుమపూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఏకలవ్య కమ్యూనిటీ భవనం నిర్మించాలి

మాట్లాడుతున్న ఆదివాసీ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు

చెన్నూర్, అక్టోబర్ 6 : చెన్నూర్ కేంద్రంగా ప్రభుత్వం ఏకలవ్య కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని ఆదివాసీ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. చెన్నూర్ పట్టణంలో ఆదివారం తెలంగాణ ఆదివాసీ ఎరుకుల సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎరుకల జనాభా అధికంగా ఉన్నదని, విద్య, ఉపాధి, ఉద్యోగ, సమాజికంగా, ఆర్థికంగా రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. క్రేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీం కింద ఊరికి దూరాన శాస్త్రీయ పద్ధతిలో పందులను పెం చుకునేందుకు సర్కారు స్థలాలు కేటాయించాలన్నారు. ఎరుకల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాబు, రాష్ట్ర నాయకులు బనాపురం శ్రీరాములు, కుతాడి శ్రీనివాస్, రాజలింగు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకిని రవి, స్థానిక నాయకులు దుగ్యాల సాయిలు, ఉంద్రాల పోచం, సమ్మయ్య, పోశం, సారయ్య, కులస్తులు పాల్గొన్నారు.

కొలవార్ మండల కార్యవర్గం

కొలవార్ (మన్నెవార్) సేవా సంఘం కార్యవర్గ సభ్యులు

చింతలమానేపల్లి, అక్టోబర్ 6 : ఆదివాసీ కొలవార్ (మన్నెవార్) సేవా సంఘం మండల కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షుడు సుంకే కిష్టయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోశయ్య ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా పూజారి రామయ్య, అధ్యక్షుడిగా గట్ల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మీసాల భగవాన్, ఉపాధ్యక్షులుగా బి రమేశ్, రవి, ప్రచార కార్యదర్శిగా ఆస్తి సదయ్య, సహాయ కార్యదర్శిగా బండి భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా కొండపల్లి సురేశ్, సాంస్కృతిక కార్యదర్శిగా డబ్బా తిరుపతి, కోశాధికారిగా ఎడ్ల శంకర్, యువజన విభాగం మండలాధ్యక్షుడిగా బుర్రి రూపేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల వెంకన్న, ఉపాధ్యక్షులుగా ఎడ్ల ఇస్తార, తిరుపతి ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు సుంకే కిష్టయ్య పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. సేవా సంఘం పెద్దలు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ద్వితీయస్థానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుతో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్

రెబ్బెన, అక్టోబర్ 6 : కామారెడ్డి జిల్లాలో ఈ నేల 4, 5 తేదీల్లో జరిగిన 69వ రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జట్టుతో జరిగిన హోరాహోరీ పోటీలో స్వప్ప తేడాతో ఓడిపోయినట్లు పేర్కొన్నారు. జట్టును బాల్ బాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ నర్సింగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, జిల్లా టగ్ ఆఫ్ వార్ అధ్యక్షుడు భాస్కర్, చెపక్ తక్రా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, షార్ప్‌స్టార్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి మారిన చందర్, శంకర్, సీనియర్ క్రీడాకారులు హరిలాల్, మల్లేశ్, రామకృష్ణారెడ్డి, కుమ్మరి మల్లేశ్, సతీశ్, థౌఫీక్ అహ్మద్, శ్రీధర్, చిన్ని, నరేశ్, సిద్ధు, గోపాల్ అభినందించారు.

బతుకమ్మ సంబురాలు

హాజీపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హాజీపూర్, అక్టోబర్ 6 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం ఆధ్వర్వంలో ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. టీఎన్జీవో కుటుంబ సభ్యులంతా బతుకమ్మ సంబురాలు జరుపుకోవడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని తెలిపారు. పాల్గొన్న ప్రతి మహిళకు బహుతులను అందజేశారు. టీఎన్జీవో మహిళా నాయకులు కెజియారాణి, సునిత, పద్మలత, సులోచనాదేవి, పద్మజ, సరిత, జ్యోతి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి మల్లయ్య, అసోషియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, కోశాధికారి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రామ్‌కుమార్, తిరుపతి, అంజయ్య, వెంకటకృష్ణ, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, అక్టోబర్ 6 : మండలంలోని ఇందిరానగర్ శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. యువతులు, మహిళలు ఆడిపాడారు.

సిర్పూర్(టీ) ఆశ్రమ పాఠశాలలో మరమ్మతులు

సిర్పూర్(టీ), అక్టోబర్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశాల మేరకు సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సెప్టెంబర్ 30న బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి బస చేశారు. పరిసరాలను పరిశీలించారు. గృహ పరిసరాలు, విద్యార్థుల గదులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు వచ్చేలోగా పూర్తిచేయాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ పనులను ప్రారంభించారు. హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

డబ్బా గ్రామంలో కబడ్డీ టోర్నీ ప్రారంభం

చింతలమానేపల్లి, అక్టోబర్ 6 : ధమ్మచక్ర పరివర్తన్ 68వ దినోత్సవాన్ని పురస్కరించుకొని దసరా సందర్భంగా మండలంలోని డబ్బా గ్రామంలో కబడ్డీ టోర్నీని ఆదివారం చింతలమానేపల్లి, కౌటాల మాజీ ఎంపీపీలు డుబ్బుల నానయ్య, బసర్కార్ విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతలమానేపల్లి ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువకులు దుర్గం విజయ్, చింటు, శ్రీకాంత్, శ్రీవర్ధన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసి